క్లుప్తంగా

కళాపీఠం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం



పామర్రు: పద్మశ్రీ ఘంటసాల–ఎన్టీఆర్ స్మారక సంగీత కళాపీఠం వారి ఆధ్వర్యంలో స్థానిక అంకమ్మతల్లి ఆలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా 25 మంది ఉపాధ్యాయులను శాలువాలు, పుష్పమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు లాయర్ బడె రాఘవరావు, పెదపారుపూడి ఎంఈఓ బొడ్డు శ్రీనివాసరావు, నూజివీడు ఐఐఐటీ ప్రొఫెసర్ జ్యోతిలాల్ నాయక్, స్థానిక ప్రసన్న కళాశాల ప్రిన్సిపాల్ సంగెపు వెంకట్రామయ్య, శృతి వైద్యశాల చైర్మన్ శేఖర్, చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ బొగ్గరపు జాలయ్యలు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో కళాపీఠం గౌరవ అధ్యక్షుడు కోటి పాండురంగారావు, అధ్యక్షుడు కాటూరి వెంకటమురళీ కృష్ణ, కళాపీఠం ముఖ్య సలహాదారులు పాగోలు మహాదేవ్ రాజు, ప్రధాన కార్యదర్శి దగ్గుమిల్లి హరికృష్ణ, కోశాధికారి కోడేబోయిన అజయ్, ఆర్కే విద్యాసంస్థల అధినేత రామకృష్ణ పాల్గొన్నారు.

వరుడిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే కైలే



పామర్రు: స్థానిక యలమర్రు రోడ్డులో నివాసం ఉంటున్న వైఎస్సార్ విగ్రహ కమిటీ సభ్యుడు, పార్టీ సీనియర్ నాయకుడు కొల్లి రాజశేఖర్‌రెడ్డి కుమారుడి వివాహం ఆదివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ రాజశేఖర్‌రెడ్డి ఇంటికి వెళ్లి పెండ్లి కుమారుడిని ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, మోరా వెంకటరెడ్డి, కొచ్చెర్ల శ్రీనివాసరావు ఉన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

తోట్లవల్లూరు: దోమల నిరోధానికి తోట్లవల్లూరు గ్రామ పంచాయతీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. గ్రామంలో గత కొన్ని రోజులుగా దోమల తీవ్రత ఎక్కువైంది. దోమల వ్యాప్తితో గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. దోమల బెడద నివారణకు పంచాయతీ సర్పంచ్ పెనుమత్స రాధిక ఫాగింగ్ చేపట్టారు. సాత్‌వల్లూరులో శనివారం రాత్రి, నార్తువల్లూరులో ఆదివారం ఫాగింగ్ నిర్వహించనున్నట్లు సర్పంచ్ రాధిక తెలిపారు. గ్రామంలో దోమల మందు పిచికారీ చేయిస్తామన్నారు. ఆయా కార్యక్రమాలను పంచాయతీ కార్యదర్శి పుష్పనాథం పర్యవేక్షించారు.

శతాధిక వృద్ధురాలి మృతి



మొవ్వ: మండల కేంద్రమైన మొవ్వ గ్రామంలో శతాధిక వృద్ధురాలు గుత్తా జయమ్మ(101) తుది శ్వాస విడిచారు. మృతురాలి అల్లుడైన మండవ అంకినీడు ఇంట్లో ఆమె అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆమెకు 81 సంవత్సరాల కుమార్తె, ఇద్దరు మనుమరాళ్లు, మునిమనవలు, మనవరాళ్లు ఉన్నారు. బంధువులు, గ్రామస్తులు ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఆర్బీకేల్లో అందుబాటులో ఎరువులు

మండవల్లి: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి షేక్ జరీనా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎరువులు కావలసిన రైతులు సంబంధిత వీఏఏలను సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గంగానమ్మ జాతరలు

- వాడవాడలా విశేష పూజలు
- ఆలయాల్లో భక్తుల కోలాహలం

గుడివాడటౌన్: గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గాల వ్యాప్తంగా గంగానమ్మ జాతరలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వాడవాడలా అమ్మ వార్లకు విశేష పూజలు, అభిషేకాలు జరిపారు. దీంతో ఉదయం నుంచే ఆలయాల్లో భక్తుల కోలాహలం నెలకొంది. గుడివాడ పెద్దవీధిలో గంగానమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. గత 70 సంవత్సరాలుగా గంగానమ్మకు జాతర చేసుకోవడం ఆనవాయితీగా వస్తుందని స్థానికులు అంటున్నారు. విచిత్ర వేషధారణ, అమ్మవారి అలంకారాలతో తీన్‌మార్ వాయిద్యాలు, డప్పులతో ఊరేగుతూ పెద్దవీధిలో సంబరాలు జరిపారు. భక్తులు అమ్మ వారిని దర్శించుకుని, మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, ఎ.నాగమల్లేశ్వరరావు, కె.ఆంజనేయ ప్రసాదు, చుండూరి శేఖర్, మూడెడ్ల ఉమ, వెంపల అప్పారావు, పి.శ్రీను, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గోకరకొండ బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

యలమర్రులో..

యలమర్రు(పెదపారుపూడి): మండలంలోని యలమర్రు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ గంగానమ్మ తల్లి సంబరం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారికి మహిళ భక్తులు పొంగిళ్లు వండి నైవేద్యం సమర్పించారు. అనంతరం అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. యువకులు అమ్మవారి ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు.

మండవల్లిలో జాతర

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం గంగానమ్మ జాతరలను ఘనంగా నిర్వహించారు. మండవల్లిలో వెలమ కులస్తులు జాతర సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపారు. భక్తి గీతాలు ఆలపిస్తూ జరిపిన పాట కచేరి, డప్పు వాయిద్యాల కనుగుణంగా యువకులు చేసిన డ్యాన్స్ ప్రోగ్రామ్‌లు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వెలమ ప్రముఖులు పాల్గొన్నారు. అలాగే ఉనికిలి ఎస్సీ కాలనీలో నిర్వ హించిన గంగానమ్మ జాతర కనుల పండువగా జరిగింది. తీన్మార్ డప్పుల నడుమ అమ్మవారిని, పోతురాజును నీళ్ల వారపోసి పసుపు,కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. ఉనికిలి మాజీ సర్పంచ్, పీఏసీఎస్ డైరెక్టర్ కారే వెంకటలక్ష్మి, కమిటీ సభ్యులు కారే ధర్మారావు, గడ్డం కొండలరావు, జి.ఫణీంద్ర, టి వీరబ్రహ్మం, ఎస్.పరంజ్యోతి, కె.కొండలరావు పాల్గొన్నారు.



కైకలూరు బైపాస్ రోడ్డులోని గంగానమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

ఘనంగా గంగానమ్మ జాతర

కైకలూరు: గంగానమ్మ నీ చల్లని దీవెనలు మాకు అందించమ్మా అంటూ భక్తులు వేడుకున్నారు. కైకలూరు బైపాస్ రోడ్డు ప్రారంభంలో గంగానమ్మ ఆలయం వద్ద శ్రావణమాసం ఆదివారం సందర్భంగా భక్తులు నైవేద్యాలను సమర్పించారు. ముఠా కార్మికులు ఊరేగింపుగా వచ్చి అమ్మకు నైవేద్యాలు అందజేసి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జాతర నిర్వాహకులు తులసి పూర్ణ మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు గంగానమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ నెల 6న అభిషేకాలు, నైవేద్యాలు, 7న చలి నైవేద్యాలు సమర్పణ, 8న శ్రావణమాస కుంకుమ పూజలు, 9న చలివిడి, వడపప్పు, పానకం, 10న అమ్మవారి గ్రామ జాతర, వేడి నైవేద్యాలు సమర్పిస్తామని చెప్పారు. భక్తులు పాల్గొనాలని కోరారు.



యలమర్రులో గంగానమ్మ తల్లి



ఉనికిలిలో జాతర నిర్వహిస్తున్న భక్తులు



గుడివాడ వేడుకల్లో పాల్గొన్న ప్రజలు

కౌలురైతులకూ రైతుభరోసా

- కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డుల జారీ
- వ్యవసాయశాఖ పథకాలన్నీ వర్తింపు
- హర్షం వ్యక్తం చేస్తున్న కౌలురైతులు


పమిడిముక్కల: దేశంలో ఎక్కడా లేని విధంగా కౌలుదారులకూ రైతు భరోసా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మనదే. పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రం(సీసీఆర్సీ) కార్డులతో సాగుదారులకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సంయుక్త పర్యవేక్షణలో సీసీఆర్సీ జారీ అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులతో పాటు దేవాదాయ, అటవీ భూములను పండించుకొనే గిరిజన రైతుల వరకు రైతు భరోసా అందిస్తున్నారు. కౌలు రైతులకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేకంగా చట్టం తీసుకువచ్చారు. భూ యజమానులను ఒప్పించి, భూమినే నమ్ముకొని జీవిస్తున్న వాస్తవ సాగుదారులకు సీసీఆర్సీ కార్డులు మంజూరు చేస్తున్నారు.

కార్డులతో బహుళ ప్రయోజనాలు

కార్డుల వల్ల పంటరుణం, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం, రైతు భరోసా, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు వంటివి అందుతాయి. ఈ విధమైన కార్డులు లేకపోవడం వల్ల కౌలు రైతుకు గతంలో పంటనష్టపరిహారం, ప్రభుత్వ పథకాలు ఏవీ అందేవి కాదు. మండలంలో 22 వేల ఎకరాల సాగు భూమి ఉంది. 8,900 మంది రైతులు ఉన్నారు. 20 వేల ఎకరాల్లో వరిసాగు చేయగా, 2 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. 2,231 మంది కౌలుదారులకు సీసీఆర్సీ కార్డులు అందజేశారు. ఇందులో 573 మందికి రైతు భరోసా కింద రూ.42.97 లక్షలు మంజూరు చేశారు. మిగిలిన వారికి ఒకే కుటుంబం, ఆ పొలంలో యజమాని తీసుకొని ఉండటం తదితర కారణాల వల్ల రైతు భరోసా మంజూరు కాలేదని ఏఓ గణేష్‌రెడ్డి తెలిపారు. రైతు భరోసా, వ్యవసాయశాఖ పథకాలన్నీ అందుతుండటంతో కౌలురైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీసీఆర్సీ కార్డుతో ప్రయోజనాలు ఇవీ..

ఏపీ పంట సాగు హక్కు చట్టం ప్రకారం రుణార్హత, కార్డుదారులకు పంట రుణం, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం, రైతుభరోసా, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు వంటివి అందుతాయి. సంక్షేమ పథకాలు అన్నీ సీసీఆర్సీ కార్డుదారులు పొందుతారు. భూమిపై కౌలురైతులకు ఎలాంటి హక్కులు కల్పించబడవు. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి పంటపై రుణం తీసుకునే అవకాశం ఉంది. రుణం వసూలు ఫలసాయంపైన మాత్రమే చేసుకునే హక్కును బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కలిగి ఉంటాయి. ఈ క్రాప్ నమోదు వాస్తవ సాగుదారుల పేరుతో జరుగుతుంది. పంట విక్రయ సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా సీసీఆర్సీ దోహదపడుతుంది.



సీసీఆర్సీ కార్డు



వ్యవసాయాన్ని పండుగ చేశారు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులను అన్ని విధాలా ఆదుకొంటూ అండగా నిలుస్తున్నారు. గత పాలకులు వ్యవసాయం దండగ అనగా, నేడు వ్యవసాయాన్ని పండుగ చేశారు. సీసీఆర్సీ కార్డుల ద్వారా కౌలురైతులకు అన్ని పథకాలు అందుతున్నాయి.

– ఆర్.కామేశ్వరరావు, కౌలురైతు



రైతుల సంక్షేమమే ధ్యేయంగా..

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది. రైతులతో పాటు కౌలు రైతులకు రైతు భరోసా అందిస్తున్నారు. కౌలుదారులంతా సీసీఆర్సీ కార్డులు తీసుకోవాలి. ఈ– క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలి. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.

– గణేష్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి

గాంధీ ఆశ్రమానికి పూర్వ వైభవం తీసుకురావాలి

మండవల్లి: మండవల్లిలో గాంధీజీ ఆశ్రమానికి పూర్వ వైభవం తీసుకురావటానికి ఎండోమెంట్స్ శాఖ కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. స్వాతంత్ర్య సముపార్జనకు ముందుగా, గాంధీజీ ఆశయాలకు స్ఫూర్తిగా శ్రీ గాంధీ సేవాశ్రమాన్ని స్థాపించారు. జిల్లాలో కొమరవోలు, మండవల్లిల్లో గాంధీ ఆశ్రమాలు గతంలో స్థాపించారు. అప్పటి స్వాతంత్ర్య సమరయోధుడు మానేపల్లి మల్లికార్జున గుప్తా, యెర్నేని సుబ్రహ్మణ్యం గ్రామస్తుల సహాయ సహకారాలతో మండవల్లిలో ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. వీరు గాంధీజీ ద్వారా కొనసాగిన సబర్మతీ ఆశ్రమంలో కూడా కొంతకాలం గడిపారు. గాంధీ మహాత్ముడు ఇక్కడ పర్యటించినప్పుడు మండవల్లి గాంధీ సేవాశ్రమంలో అడుగు పెట్టినట్లు అప్పటి గ్రామపెద్దలు పేర్కొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా గాంధీ స్థూపం

సుబ్రహ్మణ్యం మరణానంతరం మల్లికార్జునుడు తన యావచ్ఛక్తిని వినియోగించి ఆశ్రమాన్ని నడిపారు. ఎండోమెంట్స్ డిపార్టుమెంట్ దీని ఆజమాయిషీ పర్యవేక్షించే విధంగా ఆ శాఖకు అప్పగించారు. ఈయన మొదటి గాంధీ ఆశ్రమ అధ్యక్షుడు. అనంతరం మారగాని రామచంద్రరావు, గంగునేని వరప్రసాద్, బొమ్మనబోయిన గోకర్ణయాదవ్‌లు అధ్యక్షులుగా పనిచేశారు. ఈ ఆశ్రమంలో మల్లికార్జుని హయాంలో రాట్నంతో నూలు వడకుట, కూరగాయల పెంపకం వంటి కుటీర పరిశ్రమలు కొనసాగేవి. పేద వర్గాలకు ఎంతో ఆలంబనగా ఆశ్రమం నిలిచేది. ఆశ్రమానికి మూడున్నర ఎకరాల చేపల చెరువు, రెండు ఎకరాల వరిసాగు భూమి ఉంది. వీటిని లీజుకు ఇచ్చి వచ్చిన ఆదాయంతో ఆశ్రమంలో కార్యక్రమాలు చేస్తారు. ఎకరం ప్రదేశంలో గాంధీ ఆశ్రమ భవనం ఉంది. ఇందులో గాంధీజీ స్థూపం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం, అక్టోబర్ 2 గాంధీ జయంతి వంటి కార్యక్రమాలు ఇక్కడ నిర్వహిస్తారు. ఎండోమెంట్స్ ఈఓగా శింగనపల్లి శ్రీనివాసరావు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆశ్రమానికి పాలక వర్గం లేదు. గాంధీజీ ఆశ్రమానికి పూర్వ వైభవం తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



మండవల్లి శ్రీ గాంధీ సేవాశ్రమం

మోపర్రులో ముమ్మరంగా అభివృద్ధి పనులు

రూ.1.20 కోట్లతో రహదారుల నిర్మాణం

మోపర్రు(పెదపారుపూడి): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం నిధుల ద్వారా గ్రామాల్లోని అంతర్గత రహదారులను సీసీ రహదారులుగా మార్చామని సర్పంచ్ జాపల్లి రాజేశ్వరి తెలిపారు. మండలంలోని మోపర్రు గ్రామానికి తాను సర్పంచ్ అయిన తరువాత గ్రామంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపట్టానన్నారు. గ్రామంలో ఎమ్మెల్యే కైలే నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేశారని చెప్పారు. ఈ నిధులతో నాలుగు సీసీ రోడ్లు వేశామన్నారు. జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్డు, ఎంపీపీ రూ.7 లక్షలతో మూడు గ్రావెల్ రోడ్లు పూర్తి చేశామని చెప్పారు. జలజీవన్ మిషన్ నుంచి రూ.23 లక్షల నిధులతో గ్రామంలో పైపులైన్లు వేసి ఇంటింటికీ మంచినీటి కనెక్షన్ ఇచ్చామన్నారు. అలాగే గ్రామంలో రూ.40 లక్షలతో చేపట్టిన సచివాలయం పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. ఆర్బీకే, హెల్త్ క్లినిక్ కేంద్రాలకు రూ.43 లక్షలతో పనులు ప్రారంభించామని, పనులు శరవేగం జరుగుతున్నాయని చెప్పారు.



మోపర్రులో నిర్మించిన సీసీ రోడ్డు

కొనసాగుతున్న పెన్షన్ల పంపిణీ

పామర్రు: నియోజకవర్గంలో సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఆదివారం కొనసాగింది. పామర్రు పంచాయతీలో స్థానిక శాసనసభ్యుడు కైలే అనిల్‌కుమార్ సహకారంతో పలువురికి నూతన పెన్షన్లు మంజూరయ్యాయి. పామర్రు మండల పరిషత్ వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, వార్డు మెంబరు కుతాడి శశిరేఖ తదితరులు నూతన పెన్షన్లను అందజేశారు. వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మండల పరిధిలో మొత్తం 7,600 వరకు పలు రకాల పెన్షన్‌లు ఉన్నాయని, వీటికి అదనంగా ప్రభుత్వం 425 నూతన పెన్షన్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్‌ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వీరంకి ప్రసాద్, కట్టా చిన్ని, పామర్రు వీర వెంకటేశ్వరరావు, వలంటీర్లు జి.అంజలి, వీరంకి ఉషారాణి పాల్గొన్నారు.



రఫీకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ భవాని

ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేత

గుడివాడటౌన్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి ఆదివారం పింఛన్ పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన 11వ వార్డు దేవరపల్లి సచివాలయం పరిధికి చెందిన మహమ్మద్ రఫీ మంగళగిరిలోనే ఎన్నారై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా పెన్షన్‌ను వార్డు వలంటీర్ బొడ్డు భవాని ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు. వలంటీర్‌ను రఫీ కుటుంబ సభ్యులు అభినందించారు.

ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన



గుడివాడలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం



వైద్య శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్

గుడివాడటౌన్: గుడివాడ, పమిడిముక్కలలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక ఏలూరు రోడ్డులోని నాగవరప్పాడులో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్త్రీలకు సంబంధించిన వ్యాధులు, క్యాన్సర్, ఇతర వ్యాధులకు సంబంధించి 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. క్లబ్ సభ్యుడు మెరుగుమాల శివరామకృష్ణ తల్లిదండ్రులు రామారావు–భాస్కరమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల వితరణతో వైద్యశిబిరం నిర్వహించినట్లు క్లబ్ అధ్యక్షుడు అర్జా ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ గవర్నర్(ఎలక్ట్) చిన్నం రామకృష్ణ, మాజీ గవర్నర్ బొగ్గారపు తిరుపతయ్య, కార్యదర్శి బ్రహ్మాజీ, డాక్టర్ ప్రత్యూష పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

పమిడిముక్కల: ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వీరంకి బలుసలమ్మ తెలిపారు. మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కృష్ణాపురం ప్రాథమిక పాఠశాలలో అసూరి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని వైస్ ఎంపీపీ గంజాల సీతారామయ్యతో కలిసి ప్రారంభించారు. బీపీ, సుగర్, మెదడు, వెన్నుముక, నరాల వ్యాధులకు సంబంధించి 150 మందికి పరీక్షలు జరిపి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం వైద్యులను సత్కరించారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ పరసా జగన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో నిరుద్యోగ సమస్య

గుడివాడటౌన్: కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశంలో నిరుద్యోగ సమస్య పెరుగుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్సీపీ రెడ్డి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్పొరేట్ విధానంతో దేశానికి ఈ దుస్థితి దాపురించిందన్నారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టే విధానంలో భాగంగానే నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయడం లేదని చెప్పారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ సంస్థలకు అమ్మివేస్తున్నారని దీని కారణంగానే నిరుద్యోగ సమస్య పెరిగిపోతుందన్నారు. బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే దిశగా ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి పి.రజిని పాల్గొన్నారు.

కేంద్ర విధానాలకు నిరసనగా ప్రచారం

తోట్లవల్లూరు: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలని సీపీఎం మండల పార్టీ కార్యదర్శి శీలం ప్రకాశరావు డిమాండ్ చేశారు. కేంద్ర విధానాలను నిరసిస్తూ మండలంలోని బొడ్డపాడు, చినపులిపాక గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కరపత్ర ప్రచారం చేపట్టారు. నిరుద్యోగం, అధిక ధరలు, విద్యుత్ చార్జీలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కేంద్ర విధానాలతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ ఎంపీటీసీ జుజ్జవరపు ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

పక్షుల కేంద్రంలో పర్యాటకుల సందడి



చిల్డ్రన్స్ పార్కు వద్ద పర్యాటకుల సందడి



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

కైకలూరు: పర్యాటకులతో ఆటపాక పక్షుల కేంద్రం ఆదివారం సందడిగా మారింది. ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పక్షి ప్రేమికులు విచ్చేశారు. బోటు షికారు చేస్తూ పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ పక్షుల కేరింతలను దగ్గరుండి వీక్షించారు. అదే విధంగా కేంద్రం వద్ద పక్షి నమూనా మ్యూజియంను పర్యాటకులు సందర్శించారు. సమీపంలో చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులు ఆటలాడుకున్నారు. అటవీశాఖ సిబ్బంది కొల్లేరు పక్షుల విశేషాలు, భౌగోళిక పరిస్థితులను వివరించారు.